అసెంబ్లీకి 15 మంది డాక్టర్లు

పీటీఈలు, అడ్వకేట్లు, ఇంజినీర్లు కూడా

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఏకంగా 15 మంది డాక్టర్లు విజయం సాధించారు. వీరిలో అత్యధికులు తొలిసారి గెలిచినవారే. అందులో యువతే ఎక్కువ ఉన్నారు. ఇంత ఎంత మొత్తంలో డాక్టర్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడం ఇదే తొలిసారి. వీరే కాకుండా టీచర్లు, అడ్వకేట్లు, ఇంజినీర్లు సైతం ఎమ్మెల్యేలుగా గెలిచారు.

ఇంజినీర్లు, విద్యాసంస్థల అధినేతలు

ఇంజినీర్లు, విద్యాసంస్థల అధినేతలు సైతం ఈ ఎన్నికల్లో గెలిచారు. గంగుల కమలాకర్, కేపీ వివేకానంద్, వేముల ప్రశాంత్‌రెడ్డి, యశస్వినిరెడ్డి ఇంజినీర్లు కాగా, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ అధికారిగా పనిచేశారు. వెడ్మా బొజ్జు (ప్రభుత్వ ఉద్యోగి), జారే ఆదినారాయణ (పీఈటీ), లక్ష్మీకాంతారావు (మాజీ యాంకర్), కే మాణిక్‌రావు (ఆర్టీవో) పనిచేసి తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఇక విద్యాసంస్థల అధినేతలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి సైతం విజయబావుటా ఎగురవేశారు. ఐటీ కంపెనీ అధినేత మదన్‌మోహన్, రంజీ క్రికెటర్ పాడి కౌశిక్‌రెడ్డి సైతం విజయంసాధించారు. అడ్వకేట్లు కాలేరు వెంకటేశ్, జగదీశ్‌రెడ్డి సైతం ఘన విజయం సాధించారు.

ఎమ్మెల్యేలు అయిన డాక్టర్లు వీరే

- డాక్టర్ రామచంద్రునాయక్ (ఎంఎస్ సర్జన్), దోర్నకల్
- డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ (ఎంఎస్ సర్జన్), అచ్చంపేట
- డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు (ఎంఎస్ ఆర్థో), సిర్పూర్
- డాక్టర్ మురళీనాయక్ (ఎంఎస్ సర్జన్), మహబూబాబాద్
- డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ (ఎంఎస్ సర్జన్), మానకొండూరు
- డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి (ఎండీ రేడియాలజీ), నారాయణపేట
- డాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డి (పీడియాట్రిషన్), నారాయణఖేడ్
- డాక్టర్ మైనంపల్లి రోహిత్ (ఎంబీబీఎస్), మెదక్
- డాక్టర్ సంజయ్‌కుమార్ (కంటి డాక్టర్), జగిత్యాల
- డాక్టర్ సంజయ్‌కుమార్ (న్యూరోస్పైన్ సర్జన్), కోరుట్ల
- డాక్టర్ గడ్డం వివేక్ వెంకట్‌స్వామి (ఎంబీబీఎస్), చెన్నూరు
- డాక్టర్ తెల్లం వెంట్రావు (ఆర్థో), భద్రాచలం
- డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి (డెంటల్), నాగర్‌కర్నూల్
- డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి (పీడియాట్రిషన్), నిజామాబాద్ రూరల్
- డాక్టర్ మట్టా రాగమయి (పల్మనాలజిస్ట్), సత్తుపల్లి

శాసనసభకు 10 మంది మహిళలు

హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): ఈసారి పదిమంది మహిళా ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లనున్నారు. ఆదివారం వెల్లడైన ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి పదిమంది మహిళలు విజయం సాధించారు. ఇందులో నలుగురు బీఆర్ఎస్ నుంచి గెలుపొందగా, ఆరుగురు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. వారిలో బీఆర్ఎస్ నుంచి లాస్యనందిత, కాంగ్రెస్ తరపున నారాయణపేట నియోజకవర్గం నుంచి పర్ణికారెడ్డి, పాలకుర్తి నుంచి యశస్వినీరెడ్డి, సత్తుపల్లి నుంచి రాగమయి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత అసెంబ్లీలో ఆరుగురు మహిళా ఎమ్మెల్యేలు ఉండగా, ఈ సారి అదనంగా నలుగురు గెలుపొందారు.

గెలుపొందిన మహిళా అభ్యర్థులు వీరే

స్థానం	విజేత	ప్రత్యర్థి	మెజారిటీ
కంటోన్మెంట్	లాస్యనందిత (బీఆర్ఎస్)	శ్రీగణేశ్ (బీజేపీ)	17,169
ఆసిఫాబాద్	కోవ లక్ష్మి (బీఆర్ఎస్)	అజ్మీరా శ్యామ్ (కాంగ్రెస్)	22,798
నర్సాపూర్	వాకిటి సునీతాలక్ష్మారెడ్డి (బీఆర్ఎస్)	ఆవుల రాజిరెడ్డి (కాంగ్రెస్)	8,855
మహేశ్వరం	సబితా ఇంద్రారెడ్డి (బీఆర్ఎస్)	అందెల శ్రీరాములు (బీజేపీ)	26,187
ములుగు	అనసూయ(సీతక్క) (కాంగ్రెస్)	బడే నాగజ్యోతి (బీఆర్ఎస్)	33,700
వరంగల్ ఈస్ట్	కొండా సురేఖ (కాంగ్రెస్)	ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (బీజేపీ)	15,652
కోదాడ	పద్మావతిరెడ్డి (కాంగ్రెస్)	బొల్లం మల్లయ్య (బీఆర్ఎస్)	58,172
నారాయణపేట	చిట్టెం పర్ణికారెడ్డి (కాంగ్రెస్)	రాజేందర్‌రెడ్డి (బీఆర్ఎస్)	7,951
పాలకుర్తి	యశస్వినీరెడ్డి (కాంగ్రెస్)	దయాకర్‌రావు (బీఆర్ఎస్)	46,367
సత్తుపల్లి	మట్టా రాగమయి (కాంగ్రెస్)	వెంకటవీరయ్య (బీఆర్ఎస్)	19,440

ఆదివారం వనపర్తిలోని అంబేద్కర్ చౌక్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి బీఆర్ఎస్ అభ్యర్థి వాహనంపై దాడి

- నిరంజన్‌రెడ్డి కారుపై కాంగ్రెస్ కార్యకర్తల దాష్టీకం
- నిందితులను అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ నేతల ధర్నా
- కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్తుండగా ఘటన

వనపర్తి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): వనపర్తి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వాహనంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడిన క్రమంలో తాను ప్రజల తీర్పును శిరసావహిస్తానని నిరంజన్‌రెడ్డి మీడియా ముందు ప్రకటించారు. అనంతరం కారులో ఇంటికి వెళ్తున్న క్రమంలో కౌంటింగ్ కేంద్రం గేటు బయట కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. చేతులతో కారు అద్దాలను పగులగొట్టి.. కర్రలతో దాడికి పాల్పడగా వాహన అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు వెంటనే వారిని అదుపు చేసి నిరంజన్‌రెడ్డి వాహనాన్ని పంపించారు. దాడులకు పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ చౌక్‌లో మూడు గంటలపాటు ధర్నాకు దిగారు. ప్రశాంతంగా ఉండే వనపర్తిలో కొట్లాటల సంస్కృతికి కాంగ్రెస్ తెరలేపిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అరాచకాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఆనందరెడ్డి హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనను విరమించారు. ఈ ఆందోళనలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ ఆధీనంలోకి సాగర్

I పేజీ తరువాయి...

డ్యామ్ వద్దకు పంపించింది. ఆదివారం సీఆర్‌పీఎఫ్ బలగాలు నాగార్జునసాగర్ డ్యామ్‌ను స్వాధీనం చేసుకొని అక్కడున్న బారికేడ్లు, ముళ్లకంచెను తొలగించారు. ఈ క్రమంలో ఏపీ బలగాలు వారితో కొద్దిసేపు వాగ్వాదానికి దిగాయి. కేంద్రం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు తెలంగాణ, ఆంధ్రా పోలీసులను డ్యామ్‌పైకి అనుమతించేది లేదని సీఆర్‌పీఎఫ్ బలగాలు స్పష్టం చేశాయి. కుడి కాల్వకు కొనసాగుతున్న నీటి విడుదలను కేఆర్ఎంబీ అధికారుల ఆదేశాల మేరకు ఆంధ్రా అధికారులు శనివారం రాత్రి నిలుపుదల చేశారు.

అసెంబ్లీకి సీపీఐ

- కొత్తగూడెం నుంచి కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : సీపీఐ అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నది. 2009 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి గెలిచిన కూనంనేని సాంబశివరావు అప్పుడు ఎమ్మెల్యేగా తొలిసారి అసెంబ్లీకి వెళ్లారు. చాలాకాలం తర్వాత అదే కొత్తగూడెం నుంచి గెలిచి రెండోసారి అసెంబ్లీకి వెళ్తున్నారు.

మారినా విజేతలే

- బీఆర్ఎస్ మార్చిన 12 స్థానాల్లో 10 గెలుపు
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి గెలిచిన 9 మంది అభ్యర్థులు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనేక ఆసక్తికర పరిణామాలను ఆవిష్కరింపజేశాయి. బీఆర్ఎస్ పార్టీ.. 12 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చిస్తే, వీటిలో 10 నియోజకవర్గాల్లో అజేయంగా నిలిచింది. అదేవిధంగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తొమ్మిది మంది అభ్యర్థులు విజయం సాధించారు. వీరి జాబితాలు ఇలా ఉన్నాయి.

అభ్యర్థుల మార్పుతో బీఆర్ఎస్ గెలిచిన స్థానాలివే

నియోజకవర్గం	గెలుపొందిన అభ్యర్థి
అలంపూర్	విజయుడు
జనగామ	పల్లా రాజేశ్వర్‌రెడ్డి
స్టేషన్‌ఘన్‌పూర్	కడియం శ్రీహరి
నర్సాపూర్	సునీతాలక్ష్మారెడ్డి
కోరుట్ల	డాక్టర్ సంజయ్
ఆసిఫాబాద్	కోవాలక్ష్మి
దుబ్బాక	కొత్తప్రభాకర్‌రెడ్డి
బోథ్	అనిల్ జాదవ్
ఉప్పల్	బండారు లక్ష్మారెడ్డి
మల్కాజిగిరి	మర్రిరాజశేఖర్‌రెడ్డి

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి గెలిచిన అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	గెలిచిన అభ్యర్థి
కొల్లాపూర్	జూపల్లి కృష్ణారావు
కల్వకుర్తి	కసిరెడ్డి నారాయణరెడ్డి
నకిరేకల్	వేముల వీరేశం
తుంగతుర్తి	మందుల సామేల్
ఖమ్మం	తుమ్మల నాగేశ్వరరావు
పాలేరు	పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
పినపాక	పాయం వెంకటేశ్వర్లు
ఇల్లెందు	కోరం కనకయ్య
సత్తుపల్లి	మట్టా రాగమయి

పంట ఉత్పాదకత పెంపునకు 'నానో డీఏపీ'

- ప్రారంభించిన కోరమాండల్

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఆధునిక వ్యవసాయాన్ని పునర్నిర్వచించటానికి, పంట ఉత్పాదకతను అపూర్వస్థాయికి పెంచటానికి 'నానో డీఏపీ' అనే విప్లవాత్మక ఎరువును ప్రారంభించినట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. వ్యవసాయ సాంకేతిక అభివృద్ధిలో భాగంగా ఏపీలోని ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఈ నెల 5 వరకు నిర్వహించే అగ్రిటెక్ శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించినట్టు పేర్కొన్నది. సుస్థిరమైన, సుసంపన్నమైన వ్యవసాయాభివృద్ధికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ ఎస్‌హెచ్‌జీల నుంచి 110 కంటే ఎక్కువ మంది మహిళలకు డ్రోన్ ఆపరేషన్లలో శిక్షణ ఇచ్చి, ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించినట్టు కోరమాండల్ ప్రముఖ ప్రతినిధి జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. రైతులకు ట్రాక్టర్లు, వెండి నాణేలు బహుమానంగా అందజేసేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అదృష్ట డిప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసంతోపాటు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీఐపీ దర్శనానికి 3 గంటలు, ధర్మ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కార్తిక మాస వ్రతాలు, బీపారాధనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని 40 వేల మంది భక్తులు దర్శించుకోగా, ఖజానాకు రూ.64,67,273 ఆదాయం సమకూరిందని ఈవో గీత తెలిపారు. – యాదగిరిగుట్ట

లాలాజలంతో డయబెటిస్ టెస్ట్

కొత్త పరికరం అభివృద్ధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: రోజూ వేలి నుంచి రక్తం తీసి డయాబెటిస్ టెస్ట్ తీసుకోవడం ప్రజలకు ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. కానీ కెనడా, అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ప్రొటోటైప్ పరికరం ద్వారా లాలాజలం శాంపిళ్లతో ఇంట్లోనే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను కొలవవచ్చు. ఒక వ్యక్తి సలైవాలోని గ్లూకోజ్ స్థాయి వాళ్ల రక్త ప్రవాహానికి అనులోమానుపాతంలో ఉంటుంది. లాలాజలంలో గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు ప్రయోగశాలలోని ప్రత్యేక పరికరాలతో దీన్ని కచ్చితంగా కొలవాల్సి ఉంటుంది. ఇందుకోసమే సైంటిస్టులు ఈ కొత్త పరికరాన్ని అభివృద్ధి చేశారు.

ముంచుకొస్తున్న మిచౌంగ్

రేపు ఏపీలోని నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం

భువనేశ్వర్, డిసెంబర్ 3: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ఈ నెల 5న ఏపీలో తీరం దాటనున్నది. ప్రస్తుతం ఇది తీవ్ర వాయుగుండం నుంచి పెను తుఫాన్‌గా మారిందని భారత వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. 5న ఉదయం నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని తెలిపారు. ఈ సమయంలో గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించారు. తుఫాన్ ప్రభావంతో ఒడిశా, ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. మరోవైపు 54 రైళ్లను రద్దు చేసినట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రకటించింది.

ఎలాన్ మస్క్ చేతిలో దివాలా దిశగా ఎక్స్

లండన్: సామాజిక మాధ్యమం ఎక్స్ (గతంలో ట్విటర్)ను ఎలాన్ మస్క్ దివాలా దిశగా నడుపుతున్నట్లు ప్రముఖ న్యూస్ నెట్‌వర్క్ జోస్యం చెప్పింది. 44 బిలియన్ డాలర్లకు ఈ కంపెనీని ఆయన సొంతం చేసుకున్నారని తెలిపింది. దీనిలో దాదాపు 13 బిలియన్ డాలర్లు రుణాలేనని చెప్పింది. ఈ రుణాలపై సంవత్సరానికి వడ్డీ 1.2 బిలియన్ డాలర్ల తోపాటు, ఉద్యోగులకు జీతాలు చెల్లించవలసి ఉంటుందని తెలిపింది. అయితే మస్క్ ఇటీవల యూదు వ్యతిరేక పోస్ట్‌కు మద్దతివ్వడంతో డిస్నీ, యాపిల్, వాల్‌మార్ట్ వంటి పెద్ద సంస్థలు ఈ వేదికపై వ్యాపార ప్రకటనలు ఇవ్వబోమని ప్రకటించాయని పేర్కొన్నది. గత ఏడాది ఎక్స్ ఆదాయంలో దాదాపు 90 శాతం వరకు ప్రకటనల ద్వారా వచ్చిందని తెలిపింది. పెద్ద అడ్వర్టయిజర్ల నిర్ణయం వల్ల ఎక్స్ మూతపడే పరిస్థితి వస్తుందని మస్క్ కూడా ఇటీవల సంకేతాలు ఇచ్చారు. ఇదిలావుండగా, యూదు వ్యతిరేక పోస్ట్‌కు మద్దతిచ్చినందుకు మస్క్ క్షమాపణ చెప్పినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

నేటి నుంచి పార్లమెంట్

22 వరకు కొనసాగనున్న శీతాకాల సమావేశాలు

మహువాపై ఎథిక్స్ కమిటీ నివేదికపై తొలి రోజే చర్చ!

పార్లమెంట్ ముందుకు కొత్త నేర న్యాయ బిల్లులు

ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానల్ నుంచి సీజేఐని తొలగించే బిల్లు సైతం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22వ తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. వాటిని తిప్పికొట్టేందుకు అధికార బీజేపీ వ్యూహాలకు పదునుపెట్టింది. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడానికి ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించాలని ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదికను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.

సభ ముందుకు కీలక బిల్లులు..

మహువాపై ఎథిక్స్ కమిటీ నివేదికపై తొలి రోజే చర్చ నిర్వహించే అవకాశం ఉన్నది. అలాగే ఈ సమావేశాల్లో అధికార బీజేపీ పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నది. భారత శిక్షాస్మృతి(ఐపీసీ), సీఆర్‌పీసీ, సాక్ష్యాధారాల చట్టం స్థానంలో తీసుకురానున్న మూడు కొత్త బిల్లులను ఈ సమావేశాల్లో ఆమోదింపజేసుకోవాలని మోదీ సర్కారు భావిస్తున్నది. అలాగే ఎన్నికల కమిషనర్ల నియామకాల ప్యానల్ నుంచి సీజేఐని తప్పించే బిల్లు కూడా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నది.

మణిపూర్ హింస, దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై..

కొత్తగా తీసుకొస్తున్న నేర బిల్లులకు హిందీలో పేర్లు పెట్టడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వీటిని పార్లమెంట్‌లో వ్యతిరేకించే అవకాశం ఉన్నది. అలాగే మణిపూర్‌లో హింస, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపైనా ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టనున్నాయి. 'పార్లమెంట్‌లో ఏ అంశంపై చర్చకైనా మేము సిద్ధం. అయితే ఈ చర్చలు స్వల్పకాల వ్యవధితో ఉండాలి. అంతే కాక చర్చలకు అవసరమైన అనుకూలమైన వాతావరణాన్ని సభలో కల్పించాలి' అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు.

సఫీనాకు వైజ్ ప్రైజ్

- అవార్డుకు ఎంపికైన తొలి భారత మహిళగా గుర్తింపు
- 14 లక్షల మంది బాలికలను బడిబాట పట్టించినందుకు గౌరవం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: చదువును మధ్యలోనే వదిలేసిన దాదాపు 14 లక్షల మంది భారత బాలికలు తిరిగి పాఠశాలలకు వెళ్లేలా చేసిన 'ఎడ్యుకేట్ గర్ల్స్' వ్యవస్థాపకురాలు సఫీనా హుస్సేన్‌కు ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఇన్నోవేషన్ సమ్మిట్ ఫర్ ఎడ్యుకేషన్ (డబ్ల్యూఐఎస్ఈ–వైజ్) అవార్డు దక్కింది. ఈ అవార్డును గెలుచుకొన్న తొలి భారత మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. అవార్డు కింద ఆమెకు రూ.4 కోట్లు దక్కనున్నాయి. ఈ సందర్భంగా సఫీనా స్పందిస్తూ 'కొన్ని సమస్యల వల్ల బాలికలు చదువుకు దూరం కావడం బాధాకరం. ఈ సమస్య నాకు కూడా ఎదురైంది. మూడేండ్లు చదువు మానేసి ఇంట్లోనే కూర్చొన్నా. చదువు మానేసిన బాలికలను తిరిగి పాఠశాలలకు పంపేలా చూడాలని నిర్ణయించి ఓ సంస్థను స్థాపించి విజయం దిశగా పయనిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఖతార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వారం దోహాలో జరిగే డబ్ల్యూఐఎస్ఈ 11వ సమావేశంలో ఆమెకు ఈ అవార్డును అందజేయనున్నారు. 'బేటీ బచావో బేటీ పఢావో' అన్న మాటే వినపడని సమయంలో 16 ఏండ్ల క్రితం ఎన్జోవోను స్థాపించి బాలికలకు చదువు చెప్పి వారిని ప్రధాన విద్యాస్రవంతిలోకి తీసుకు రావాలని నిర్ణయించుకున్నా. మనం 21వ శతాబ్దంలోకి అడుగుపెట్టినా చాలా గ్రామీణ ప్రాంతాల్లో మేకలు తమ ఆస్తి, ఆడపిల్లలు అప్పులుగా కొందరు తల్లిదుండ్రులు భావిస్తున్నారు' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలు విద్యకు దూరం కావడానికి పేదరికం నుంచి పితృస్వామ్యం వరకు అనేక కారణాలున్నాయన్నారు. తొలుత తాను ఈ సంస్థను రాజస్థాన్ గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసినప్పుడు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటన్నింటినీ అధిగమించి ఇప్పుడు దానిని మధ్య ప్రదేశ్, బీహార్,యూపీ రాష్ట్రాలకు కూడా విస్తరించినట్టు సఫీనా తెలిపారు.

బటర్ చికెనే బెటర్

వంద చికెన్ వంటకాల్లో ప్రథమ స్థానం టేస్ట్ అట్లాస్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: చికెన్ అనగానే మాంసాహార ప్రియులకు నోరూరుతుంది. అయితే చికెన్‌తో వందలాది రకాలు చేయవచ్చు. అయితే వీటిలో కొన్నింటినే చాలా మంది రుచి చూసి ఉంటారు. చాలా రకాలు ఎక్కువగా రెస్టారెంట్లలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. అయితే చికెన్‌లలో బటర్ చికెన్ రుచే వేరంటూ ఆహార ప్రియులెవరైనా ఒప్పుకుంటారు. ఇదే విషయాన్ని టేస్ట్ అట్లాస్ కూడా పేర్కొంటున్నది. ప్రపంచంలోని వంద రకాల చికెన్ వంటకాల్లో బటర్ చికెన్‌కే ఎక్కువ మంది ఓటేయడంతో ప్రథమ స్థానాన్ని దక్కించుకుందని సంప్రదాయ వంటకాలకు ఆన్‌లైన్ గైడ్‌గా ఉన్న టేస్ట్ అట్లాస్ తన లిస్టులో వెల్లడించింది.

అవి ఏలియన్సే!

మెక్సికో ప్రభుత్వం ప్రపంచానికి చూపిన(సెప్టెంబర్‌లో) ఏలియన్స్ మమ్మీలకు సంబంధించి సరికొత్త విషయం బయటకు వచ్చింది. పెరూలో వీటిపై డీఎన్ఏ పరీక్షలు జరపగా, ఇవేవీ భూమిపై ఉన్న మానవుడు, ఇతర జీవరాశి డీఎన్ఏతో సరిపోలటం లేదని సైంటిస్టుల పరిశోధనలో తేలిందని జర్నలిస్టు జైమీ మాసన్ వెల్లడించారు. గ్రహాంతరవాసులు భూమి పైకి వచ్చినట్టు ఇప్పటివరకు శాస్త్రీయ ఆధారాలు లేవు. కానీ రెండు నెలల క్రితం మెక్సికన్ పార్లమెంట్‌లో అక్కడి ప్రభుత్వం రెండు శవపేటికలను తీసుకొచ్చి, అందులో ఉన్నవి రెండు ఏలియన్స్ మమ్మీలుగా చూపింది. పెరూలో జరిపిన తవ్వకాల్లో ఇవి లభ్యమయ్యాయని, కొన్ని లక్షల సంవత్సరాల క్రితం నాటివిగా పేర్కొన్నది.

ఎర్ర సముద్రంలో అమెరికా యుద్ధ నౌకపై దాడి

దుబాయ్ : ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం నేపథ్యంలో మధ్య ఆసియాలో సముద్రంలో ప్రయాణించే నౌకలపై తరచూ దాడులు జరుగుతున్నాయి. ఎర్ర సముద్రంలో ఆదివారం ఓ అమెరికన్ యుద్ధ నౌకపైనా, కొన్ని వాణిజ్య నౌకలపైనా దాడులు జరిగాయని పెంటగాన్ తెలిపింది. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిపింది. అంతకు ముందు బ్రిటిష్ మిలిటరీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఎర్ర సముద్రంలో అనుమానాస్పద డ్రోన్ దాడి, పేలుళ్లు జరిగాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా యెమెన్‌లోని హౌతీ రెబెల్స్ ఎర్ర సముద్రంలో ప్రయాణించే నౌకలపై దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే.

పెరగనున్న హోండా కార్ల ధరలు

న్యూఢిల్లీ: జపనీస్ కంపెనీ హోండా వచ్చే నెల నుంచి కార్ల ధరలను పెంచాలని నిర్ణయించింది. భారత్ మార్కెట్లో విక్రయిస్తున్న ఎలివేట్, సిటీ, అమేజ్ మోడళ్ల ధరలు పెరగబోతున్నట్లు హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) కునాల్ బెహ్ల్ ఆదివారం తెలిపారు. ఇన్‌పుట్ కాస్ట్ పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, ఆడి ఇండియా కూడా కార్ల ధరలను వచ్చే నెల నుంచి పెంచబోతున్నాయి. అదేవిధంగా టాటా మోటార్స్, మెర్సిడెస్ బెంజ్ ఇండియా కూడా తమ కార్ల ధరలను వచ్చే నెల నుంచి పెంచేందుకు యోచిస్తున్నాయి.

సైన్యం ఉపసంహరణకు భారత్ అంగీకారం

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు వెల్లడి

మాలే: మాల్దీవుల నుంచి భారత సైన్యాన్ని ఉపసంహరించేందుకు భారత ప్రభుత్వం అంగీకరించిందని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు ఆదివారం మీడియాకు తెలిపారు. అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు కూడా భారత్ అంగీకరించిందన్నారు. అయితే భారత ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, దుబాయ్‌లో జరిగిన కాప్29 వాతావరణ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముయిజ్జు కాసేపు చర్చలు జరిపారు. మాల్దీవుల నుంచి భారత దళాలను వెనుక్కు రప్పించడంపై చర్చ జరిగింది. ఇరు దేశాల సంబంధాల్లో ఇది చాలా ముఖ్యమైన అంశమనే విషయాన్ని ఇరు పక్షాలు అంగీకరించాయి. వీటిని కొనసాగించడంపై చర్చలు కొనసాగుతున్నాయి. ముయిజ్జు ఇటీవలే అధ్యక్ష పదవిని చేపట్టారు.